


జరిగిన జగన్నాటకం

ఎడమ చేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడిచేతి పోరాటానికి మహాబసు అనే నాయకుడయ్యాడు బోసు. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం తెలుసుకున్నాడు. మహాబసుపై దళాధిపతి చేసిన దాడిలో సుధాముడు మరణించాడు. వామదేవుడి గూఢచారి ఉదంతుడుతో రహస్య మార్గం ద్వారా రాజప్రాసాదంలో వామదేవుణ్ణి కలిసాడు మహాబసు. మహాబసు మరణించాడని నమ్మిన ద్వీప ఉద్యమాన్ని ఆపేయాలన్న ప్రయత్నం చెయ్యటం ఉగ్రకు నచ్చక పోవటంతో ఆమెను బంధించాడు. తానే ఆచార్య వేదాంతం అని డాక్టర్ నరసింహం చెప్పాడు.

- 25 –

ఎదురుగా వామదేవుడు.

ఎవరైతే తన శత్రువని భావించి ఇన్నాళ్ళుగా పోరాటం నడుపుతున్నాడో ఆ వామదేవుడు, మోకరిల్లి వున్నాడు. తాను శత్రువునికానని అంటున్నాడు.

ఏమనాలో అర్థం కాలేదు మహాబసుకి.

మరో పక్క జ్ఞాతి అని పరిచయం చేసుకున్న శతాధిక వృద్ధుడు. ఆ కోటలో మహాబసు బందీ కాదని, అతన్ని కాపాడే ప్రయత్నంలో అతిథిగా తీసుకొచ్చారని చెప్తున్నాడు.

అయోమయంగా అనిపించిందతనికి.

ఆ మందిరంలో వున్న నాలుగో వ్యక్తి ఉదంతుడు. వామదేవుడు మోకరిల్లడం చూసి అసహనంగా కదిలాడు. వామదేవుడు చేసిన ప్రకటన విని వడివడిగా ముందుకు కదిలాడు.

"ప్రభూ, మీరు అలా మాట్లాడటం భావ్యం కాదు. తప్పు చేసినా ఒప్పు చేసినా మీరు మా మహాధిపతి. ఈ సవ్యలంకకి సర్వాధిపతి. మీరు ఇంత బేలగా మాట్లాడటం సహించలేకపోతున్నాను" అన్నాడు వామదేవుడి ముందు తల వంచి.

అప్పుడే తేరుకున్న మహాబసు ముందుకు వెళ్ళి వామదేవుడి భుజాలు పట్టుకోని పైకి లేపాడు.

"చూశావా మహాబసు ఉదంతుడు ఏమంటున్నాడో. ఈ రాజ్యం, ఈ అధికారం తెచ్చిపెట్టిన పరిస్థితికి నేను బలి అయ్యానని చెప్తుంటే అలా అదే అధికారాన్ని, హోదాని అడ్డుపెట్టి అలా అనకూడదంటూ నాకు చెప్తున్నాడు. దీనంతటికీ కారణం ఇదే. నేను ఈ రాచరికంలో పుట్టడం." అంతకంతకూ వివశుడిగా మారుతున్న వామదేవుణ్ణి వారించాడు మహాబసు.

"మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావటంలేదు మహాధిపతీ. ముందు ఇక్కడ ఆసీనులుకండి. సావకాశంగా మాట్లాడుకుందాం" అంటూ అతన్ని ఉచితాసనం మీద కూర్చోపెట్టాడు. కూర్చోడానికైతే కూర్చున్నాడు కానీ బెరుకు బెరుకుగా వున్నాడు వామదేవుడు. జ్ఞాతి అతనికి దగ్గరగా వచ్చి "శాంతించు మహాధిపతీ" అంటూ అనూనయంగా భుజాన తట్టాడు.

"ఇప్పుడు చెప్పండి. మీరు కుడి చేతివాటం కలిగి వుండటమేమిటి? మేమంతా కుడిచేతి వాడకాన్ని సమర్థిస్తూ ఇంత యుద్ధం చేస్తుంటే మీరెందుకు మిన్నకుండిపోయారు? ఈ పోరాటాన్ని ఎందుకు సాగనిచ్చారు? వందల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలిసిపోతుంటే మీకు కనీసం దీన్ని ఆపాలన్న ఆలోచన రాలేదా?" ఆవేశంగా అడిగాడు మహాబసు.

"అనుక్షణం అనిపించింది. ప్రతిసారీ ఆపాలనే అనుకున్నాను. కానీ ఆపలేని స్థితి నాది. ఆ రోజు నిరాయుధులై వున్న సత్యోద్యమకారులని ఈ చేతులతో నరికినప్పుడు నేను పడిని క్షోభ ఎంత దారుణమైనదో చెప్పలేను. ఆ తరువాత పగలు రాత్రి ఆ మారణహోమం మళ్ళీ మళ్ళీ నా మనసులో చేస్తూనే వున్నాను. చేసిన ప్రతిసారీ అణువణువుగా నేను చనిపోతున్నంత బాధని అనుభవిస్తున్నాను. ఆ రోజు నా చేతులకి అంటిన రక్తపు మరకలు నా హృదయాన్ని చేరి అనుక్షణం దహించివేస్తున్నాయి"

"అదే ఎందుకు చేశారు"

"రాజధర్మం. నేను ఇక్కడ మహాధిపతిగా వున్నాను మహాబసు. ఆ పదవి ప్రతీ సందర్భంలో నన్ను రాజ్యంలో వున్న చట్టాలను కాపాడాలని చెప్తునే వుంటుంది. ఆ రోజూ అదే జరిగింది."

"రాజ్య చట్టాన్ని, రాజ ధర్మాన్ని అంతగా పట్టించుకున్న మీరు మానవధర్మాన్ని కూడా యోచించకపోవటం విడ్డూరంగా వుంది." మహాబసు గొంతులో కొంత కర్కశత్వం గమనించారు మిగిలినవారు. జ్ఞాతి మహాబసు వైపు తిరిగాడు.

"అలా నువ్వు భావించడంలో తప్పులేదు మహాబసు. కానీ ఈ కుడి ఎడమల వెనుక ఒక రహస్యం దాగి వుంది. అది తెలిస్తే కానీ వామదేవుడు ఎందుకు అలా ప్రవర్తించాడో నీకు అర్థం కాదు. చెప్తాను విను. దాదాపు రెండు వందల సంవత్సరాల క్రితం సవ్యలంకలో అందరూ కుడిచేతిని వాడేవాళ్ళే వుండేవాళ్ళు. ఈ వామదేవుడి ముత్తాతగారి తండ్రి కాలం అది. ఆయన పేరు జయదేవుడు. ఆయనకు ఒక కొడుకు పేరు సుదేవుడు. ఆ సుదేవుడికి విద్యలు నేర్పే బాధ్యత మా తాతగారికి అప్పజెప్పాడు జయదేవుడు. అయితే సుదేవుడు బయట ప్రపంచానికి కనిపించకుండా పెరిగాడు. ఒక ఒంటిస్థంభం మేడలో, మరే ప్రాణీ ప్రవేశించలేని విధంగా ఏర్పాటు చేసి అక్కడే సుదేవుణ్ణి వుంచాడు జయదేవుడు. అక్కడికి వెళ్ళిరావడానికి అనుమతి వున్న ఒకరిద్దరిలో మా తాతగారు ఒకరు.

"అలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఉన్నట్టుండి ఒకరోజు ఒక మహానుభావుడు సవ్యలంకకి వచ్చాడు. కుడి చేతిని వాడటం అశుభమనీ, అమంగళకరమనీ, దేవుడి పట్ల జరుపుతున్న అపరాధం అనీ ప్రకటించాడు. జయదేవుడు ఆయన్ని సమర్థించాడు. ఆయనను రాజ్యానికే మహాచార్య హోదాని ఇచ్చాడు. ఆయన చెప్పిందే వేదం. దేవుళ్ళు మారిపోయారు. ఎడమ చేతివాటం వున్న వాళ్ళే దేవుళ్ళయ్యారు. కాని వాళ్ళు ఊరి పొలిమేరల్లో ముక్కలై తేలారు. అందరు అర్చకులు ఎడమచేతినే వాడాలని భక్తులందరికీ చెప్పారు. కళాకారులు కథలు కట్టి ప్రచారం చేశారు. పాటలు పాడారు.

"ఇదంతా జరిగిన కొంతకాలానికి మా తాతగారిని హతమార్చాలని ప్రయత్నం జరిగింది. మా నాన్నగారు చిన్నవాడిగా వున్నప్పుడు జరిగిందది. తాతగారు ఒంటినిండా గాయాలతో ఇంటికి వచ్చారుట. మా నాన్నగారిని పిలిపించి ఒక విషయం చెప్పారు. ఒంటి స్థంభం మేడలో వున్న యువరాజుది ఎడమచేతి వాటం. అన్ని ముఖ్యమైన పనులకీ, దైవకార్యాలకీ ఎడమచేతినే వాడతాడు. అందుకే అతన్ని చూసి ఎవరూ గేలి చెయ్యకూడదని ఎవరికీ కనపడకుండా ఒంటి స్థంభం మేడలో వుంచాడు. మా తాతగారి సహాయంతో అతని అలవాటు మాన్పించి కుడిచేతిని వాడేలా చెయ్యాలని ప్రయత్నం చేశారు. విధి అనుకూలించలేదు. సుదేవుడు ఎడమ చేతిని తప్ప కుడి చేతిని వాడనని తెగేసి చెప్పాడు. ఈ పరిస్థితిలో జయదేవుడి ఈ ప్రణాలిక వేశాడు –

"కొడుకు చేసే తప్పుని సరి చెయ్యడం కన్నా ఏదైతే కొడుకు చేస్తున్నాడో దాన్నే సరైనదిగా ప్రకటిస్తే సరిపోతుందని అనుకున్నాడతను. అందుకు అనుగుణంగా ఒక మహాచార్యని కల్పించాడు. కట్టు కథలు రాయించాడు. ఎడమ చేతిని వాడటం సరైన పని అనీ ఊరూర ప్రచారమయ్యేలా చేశాడు. అయితే ఈ విషయం మొత్తం తెలిసిన వ్యక్తి మా తాతగారు. విద్య నేర్పించేందుకు ఆ ఒంటిస్థంభం మేడలోకి తరచుగా వెళ్తూ వస్తూ ఇదంతా తెలుసుకున్నాడు. ఆ విషయాన్ని ఆయన ఎక్కడ బహిర్గతం చేస్తాడో అన్న అనుమానంతో ఆయన్ని హతమార్చారు. ఇదంతా వివరంగా చెప్పి కన్నుమూశాడాయన. అది జరిగిన రెండో రోజు ఎడమచేతిని వాడటం చట్టంగా మారింది. ఎవరైనా కుడి చేతిని వాడినా, కుడిచేతిని వాడమని సలహా ఇచ్చినా, పిల్లలు కుడిచేతిని వాడటాన్ని ప్రోత్సహించినా మరణశిక్ష విధించేలా చట్టం చేశారు. కొన్ని వందల మందిని అలా పొట్టనపెట్టుకున్నారు. దాని పర్యవసానమే సవ్యలంక ఎడమచేతిని వాడే మనుషుల రాజ్యంగా మారిపోయింది."

జ్ఞాతి చెప్పిన విషయం విని మహాబసు ఆశ్చర్యపోయాడు. అదంతా ఏదో కలలా అనిపించింది. నమ్మశక్యంగా అనిపించలేదు.

"ఇది ఎలా సాధ్యం జ్ఞాతిగారూ? ఒక మహాధిపతి రాజ్యంలో వున్న మనుషులని స్వాభావికమైన కుడిచేతివాటం నుంచి ఎడమచేతి వాటంగా మార్చివేయడం జరిగే పనేనా?" అడిగాడు అపనమ్మకంగా.

"సాధ్యమే" అన్నాడు వామదేవుడు. "అలా జరగడానికి సహాయపడ్డవేంటో తెలుసా ఒకటి భక్తి, రెండు భయం. దైవం పేరుతో మతాధిపతులు, ఆచార్యులు చేసిన ప్రచారం ప్రజలలో కుడిచేతిని వాడటం దైవదూషణ అన్న నమ్మకాన్ని పెంపొందించింది. అదంతా నమ్మని

వాళ్ళని భయపెట్టి అమలుపరచడానికి అధికారం ఎలాగూ వుంది. ఆ విషయం గురించి ఎదురుతిరగడం అటుంచి, కనీసం మాట్లాడటం కూడా రాజ్యధిక్కారం అయినప్పుడు ఎవరు మాట్లాడతారు. కళ్ళ ముందే మరణశిక్షలు అమలౌతుంటే ఎవరు ధైర్యం చెయ్యగలరు. అలాగని అందరూ ఊరుకోలేదు. ఎదురుతిరిగారు. ఉగ్ర తండ్రి అదే పని చేశాడు. హతుడయ్యాడు. ఆ వారసత్వాన్ని ఉగ్ర అందుకున్నాడు. ఇన్నాళ్ళకు నువ్వు వచ్చావు. మహాబసు... ఇక ఈ అన్యాయానికి తెరపడే రోజు వచ్చేసింది." అన్నాడు వామదేవుడు.

"నేను వచ్చేదాకా ఎందుకు ఎదురుచూశారు? మీరు మహాధిపతి. పైగా కుడిచేతివాటం వున్నవాళ్ళు. మీరే ఒక చట్టసవరణ చేస్తే ఇంత మారణకాండ వుండేది కాదు కదా?" అడిగాడు మహాబసు.

గట్టిగా నవ్వాడు వామదేవుడు.

"మహాధిపతిగా వుంటే కేవలం అధికారం కాదు మహాబసు. అది బాధ్యత. పేరుకు నేను మహాధిపతిని అయితే కావచ్చు. కానీ నా సభలో వున్న ప్రతినిధుల అభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం నాకు లేదు."

"నిజాన్ని నిర్భయంగా చెప్పడానికి అవకాశం, అవసరం అక్కర్లేదు వామదేవా. నిలబడాలి. చెప్పాలి. అంతే" మహాబసు మాటలు విని తలాడించాడు వామదేవుడు.

"కావచ్చు. కానీ నేను అలా చేసి వుంటే ఏమయ్యేదో తెలుసా? నేను కూడా మీ ఉద్యమంలో భాగమై, ఉగ్రతో మీతో కలిసి యుద్ధం చేస్తుండేవాణ్ణి"

"ఎవరి మీద?" చురుగ్గా వచ్చింది మహాబసు ప్రశ్న.

సమాధానం వెంటనే రాలేదు వామదేవుడి నుంచి. నెమ్మదిగా చెప్పసాగాడు –

"ఇందాక చెప్పాను కదా. భక్తి, భయం అనే రెండు కారణాల వల్ల ప్రజలందరూ మారారు. అలా మారిన వారిలో మహాధిపతికి విధేయులైన వాళ్ళు ఉన్నారు. రాజ్యానికి సేవ చేసే వాళ్ళు వున్నారు. అధికారులు వున్నారు. వీళ్ళందరినీ కాదని నేనొక్కణ్ణే ముందుకు రాలేను. ఎందుకంటే ఎడమచేతి వాటం అనేది వాళ్ళ వాళ్ళ జీవితాలలో ఒక శిలాశాసనంగా వుండిపోయింది. ఆ విషయంలో వాళ్ళని ఛాందసులుగా, ఆ చట్టం అమలుకోసం ఏమైనా చెయ్యడానికి సిద్ధమైన మూర్ఖులుగా మార్చింది ఆ చట్టం. అలాంటి వాళ్ళు నా చుట్టూ వున్నారు. వాళ్ళని కాదంటే నా ప్రాణాలను సైతం తీసుకోడానికి సిద్ధంగా వున్నారు. నేను మరణానికి భయపడలేదు. కానీ నేనంటూ లేకపోతే కుడి చేతిని వాడమని చెప్పే వ్యకి లేకుండాపోతాడు. దానివల్ల సవ్యలంకకి జరిగే నష్టం ఎక్కువ తప్ప వచ్చే లాభం ఏమీ లేదు. అందుకే మనసు అనుక్షణం క్షోభని అనుభవిస్తున్నా ఎడమచేతి వాటాన్ని సమర్థిస్తూ వున్నాను. ఈ పాపం నన్ను ప్రజలకు దూరం చెయ్యచ్చు. పరలోకంలో నన్ను నేరస్థుణ్ణి చెయ్యచ్చు. కానీ అంతకన్నా వేరే మార్గం లేకపోయింది" విషాదమంతా గొంతులో వినపడుతుండగా చెప్పాడు వామదేవుడు.

"మహాధిపతీ" అంటూ వినపడిన ఆ కేకకి ఆ మందిరంలో వున్నవాళ్ళందరూ ఉలిక్కిపడ్డారు. జరిగిందేమిటో తెలుసుకునేంత లోనే దూసుకొచ్చి ఒక బాణం వామదేవుడి గుండెల్ని చీల్చుకుంటూ చొరబడింది. ఒక్కసారి అందరూ ఆ అరుపు వచ్చిన వైపు చూసి సంభ్రమంగా నిలబడిపోయారు.

"ద ళా ధి ప తి" నెమ్మదిగా అంటూ కూలిపోయాడు వామదేవుడు. దళాధిపతి కర్కశంగా నవ్వుతూ మరో బాణం తీసి మహాబసుకి గురిపెట్టాడు.

ఉదంతుడు ఒక్క ఉదుటున ముందుకు దూకాడు. మహాబసు గుండెల్లో దిగాల్సిన బాణం ఉదంతుడు కడుపులో దిగబడింది.

"త్వరపడు మహాబసు. ఇక్కడ్నుంచి తప్పుకో" అరిచాడు జ్ఞాతి.

మరుక్షణం మహాబసు కదిలాడు. కిందపడి వున్న వామదేవుణ్ణి ఒక్క ఊపులో పైకి లేపి తన భుజాల మీద వేసుకున్నాడు. మెరుపువేగంతో ఆ మందిరానికి వున్న మరో ద్వారం వైపు దూకాడు.

"తప్పుకో ఆచార్యా. శత్రువుకి నాకు మధ్య భగవంతుడున్నా నేను వెనుకాడను. నా ఆయుధం మీ గుండెల్లో దిగబడక ముందే తప్పుకోండి" దళాధిపతి చేసిన హెచ్చరిక వినపడుతుండగా ఆ మందిరం దాటి మరో మందిరంలోకి అడుగుపెట్టాడు.

"మహాబసూ, కుడివైపు రెండో ద్వారం వైపు పద. ఆ వైపు వున్న దేవదారు వృక్షం వెనుక రహస్య స్థావరం వుంది" వామదేవుడు అంత బాధలోనూ కూడబలుక్కోని చెప్పిన మాటలు విన్నాడు మహాబసు. "నా మరణం అనివార్యం. నన్ను విడిచిపెట్టు. నిన్ను నువ్వు కాపాడుకో" చివరగా అన్న మాటలు కూడా వినపడ్డాయి కానీ వాటిని పట్టించుకోలేదు మహాబసు.

దేవదారు వృక్షం వెనుకగా వున్న రహస్య మార్గంలో ప్రవేశించి వెంటనే వామదేవుణ్ణి కిందకు జారవిడిచి, ఆ మార్గాన్ని మూసేశాడు. వామదేవుడు చెప్పాడు కాబట్టి తెలిసింది కానీ లేకపోతే అక్కడ అలాంటి స్థావరం వున్న విషయం కనిపెట్టే అవకాశమే లేదు. బహుశా అందుకేనేమో మరికొద్దిసేపటికే అక్కడికి చేరుకున్న దళాధిపతి మహాబసు కనిపించలేదని హూంకారం చేస్తూ నిలబడిపోయాడు.

"మహాబసూ... ఇప్పటికిది మూడోసారి నా నుంచి తప్పించుకోవడం. ఎక్కడికి పోతావు? ఈ భవనాన్ని నా మనుషులు చుట్టి ముట్టారు. నీ అడుగు సవ్వడి వినపడితే చాలు, వందల శరాలు దూసుకొస్తాయి. కానీ నా చేతులతో నిన్ను చంపాలి... అందుకే నీ కోసం చూస్తున్నా... రా... బయటికిరా... ఈ రోజు నీ కుడిచేతిని నరికి ఈ సవ్యలంక భూమికి ఎరువుగా వేస్తాను... రా..." అరుస్తున్నాడతను.

మహాబసు క్షణం తటపటాయించాడు. ఒక నిర్ణయానికి వచ్చినట్లు అక్కడ్నుంచి బయటికి రాబోయాడు.

"వద్దు మహాబసూ... ఆగు..." వామదేవుడు పిలిచిన పిలుపు అతన్ని ఆపేసింది.

"కానీ మిమ్మల్ని కాపాడాలి" ఆదుర్దాగా అన్నాడు మహాబసు.

"వద్దు. ఇది సమయం కాదు. నీ ప్రాణానికి అడ్డుగా నా ప్రాణం వదులుతాను. అందుకు నాకు సంతోషమే కానీ కించిత్ బాధ కూడా లేదు. నేను చేసిన నేరానికి ఇదే నాకు సరైన శిక్షని అనుకుంటున్నాను. నా తప్పులకు శిక్ష ఇక్కడే అనుభవించి పోతున్నందుకు నాకు ఆనందంగా వుంది. దయచేసి ఆ ఆనందాన్ని దూరం చెయ్యకు..." ప్రాధేయపడుతున్నట్లు అడిగాడతను.

మహాబసు వెనక్కి వచ్చాడు. వామదేవుడి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. బయట దళాధిపతి కేకలు ఇంకా ఎక్కువయ్యాయి.

"ఇప్పుడు ఈ రాజ్యానికి అధికారి లేడు. నేనే ఉత్తరాధికారిని. ఇక నన్ను ఆపేదెవడు. నిన్ను చంపటం ఎటూ ఖాయం... నువ్వు బయటికి రాకపోతే నిన్ను ఇక్కడే బందీగా వదిలేసి నీ అనుచరులనందరినీ చంపి మరీ వస్తాను. అప్పుడైనా నీకు మరణం తప్పదు. రా... వచ్చి వీరుడిలా నీ మరణంతో ఈ కథని ఆపెయ్... లేదా నీ అనుంగుడు ఉగ్ర, నీ సహచరి ద్వీప, వేదాంతం... వీళ్ళందరి మరణం తరువాత, ఆ మరణాలకు బాధ్యత నెత్తినవేసుకోని ఆ తరువాత మరణించు... ఏది కావాలో నిర్ణయించుకో..."

వామదేవుడు బాధతో మూలిగాడు. అతన్ని కాస్త అనూనయపరిచాడు మహాబసు.

"వాడి అరుపులు పట్టించుకోకు మహాబసు. ఇది నీ విజయం కోసం రాయబడ్డ యుద్ధం. ఫలితం ఎప్పుడో నిర్ణయం అయిపోయింది. నాకు ఒక్క వరాన్ని ఇవ్వు చాలు..." అడిగాడు వామదేవుడు.

"ఒక్క ఝాము క్రితం నా శత్రువు వామదేవుడు... ఇప్పుడు నన్ను దేవుణ్ణి చేసి నన్ను వరమడుగుతున్నాడు... తలచుకోడానికే ఆశ్చర్యంగా వుంది" అన్నాడు మహాబసు. "కోరుకో మహాధినేతా... నీ కోసం నా ప్రాణమైనా సిద్ధం" అన్నాడు చివరిగా.

"నువ్వు గెలిచిన తరువాత నా సైన్యానికి ప్రాణభిక్ష పెట్టు. వారు నా అధికారానికి దాసులు. నా అనుజ్ఞల వల్ల నిందితులు. స్వతహాగా సింహాసనానికి బద్ధులు. అంతే తప్ప వాళ్ళు నీతో యుద్ధం చెయ్యడానికి కుడి చెయ్యి, ఎడమ చెయ్యి కారణం కాదు. ఈ ఒక్క వరం..." అతని గొంతు పొలమారింది.

"తప్పకుండా" అంటూ అతని చేతిలో చెయ్యి వేసి బలంగా నొక్కాడు మహాబసు.

వామదేవుడు తృప్తిగా కన్నుమూశాడు. అప్పుడు గమనించాడు మహాబసు. కలిసిన రెండు చేతులు, ఇద్దరి కుడిచేతులు.

కొన్ని వందల మంది సైనికుల మధ్య ఏం చెయ్యాలో తెలియని స్థితిలో వున్నాడు ఉగ్ర. మాటలతో ద్వీప తప్పుని నిరూపించడం దాదాపు అసాధ్యమని తెలుస్తూనే వుంది. ఇక మిగిలింది ఒకటే మార్గం. ఆమె నోరు మూయించడం. ఆమెని చంపితే సానుభూతి ఆమె వైపు వుంటుంది. తన సైన్యం తనకే ఎదురుతిరిగే ప్రమాదం వుంది. ఏం చెయ్యాలా అని సతమతమౌతున్నప్పుడు మోగింది – కొమ్ముబూర.

శత్రువు కనుచూపు మేరలో వుంటే కొమ్ముబూర వూదమని ఆదేశించాడు అనుచరులను. ఇప్పుడు వినపడ్డ ఆ శబ్దం మరణఘంటికలా వినపడిందతనికి.

"దేవరా... దళాధిపతి" అరుస్తూ చెట్టు మీద నుంచి దూకాడు ఆ అనుచరుడు.

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS